రెండు పూటలా 'ఉపాధి'

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - గార

రెండు పూటలా ఉపాధి హామీ పనులు చేపట్టాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు స్పష్టం చేశారు. మండలంలోని తూలుగు, వత్సవలస పంచాయతీల పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కనీసం ఆరు గంటల పాటు పనులు చేయడం ద్వారా గరిష్ట కూలి రూ.250 పొందవచ్చని తెలిపారు. ప్రతి కూలీ వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకే ఉపాధి హామీ దోహదపడుతుందన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎపిఒ సంధ్యారాణి, నారంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ నాయుడు, ఇతర సిబ్బంది ఉన్నారు.

లక్ష్యం చేరుకునేనా?

- జిల్లాకు 77,550 ఇళ్లు కేటాయింపు
- మరో 16 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం
- లేకుంటే ఆగిపోనున్న కేంద్ర సాయం
- గృహ ప్రవేశాల వాయిదా తర్వాత నెమ్మదించిన నిర్మాణాలు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా గత నెల 21వ తేదీన సామూహిక గృహ ప్రవేశాలు కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కార్యక్రమం వాయిదా పడడంతో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. నత్తనడకన ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పనలోనూ పెద్దగా పురోగతి సాధించలేదు. ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి నియమించిన ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు లేఅవుట్లను సందర్శించేవారు. వారి జాడ కూడా కనిపించడం లేదు. జిల్లాకు కేటాయించిన ఇళ్లన్నీ మరో 16 నెలల్లో పూర్తి కావాల్సి ఉంది. లేకుంటే గృహ నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయం నిలిపివేస్తుందని గతేడాది నవంబరులో జిల్లాకు వచ్చిన గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఇదే పరిస్థితి కొనసాగితే లక్ష్యం చేరుకోవడంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవరతాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా 77,550 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 69,265 ఇళ్లు ఆన్‌లైన్ అయ్యాయి. ఇళ్ల నిర్మాణాలకు 61,655 మంది ముందుకొచ్చారు. వీటిలో బిబిఎల్ (బిలో బేస్‌మెంట్ లెవల్) దశలో 25,104 ఇళ్లు, పునాది దశలో 10,149, పైకప్పు దశలో 4,958 ఇళ్లు ఉన్నాయి. శ్లాబ్ పూర్తయినవి 8,575 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు 12,869 ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగాయి. వీటిలో 2,929 ఇళు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరును పరిశీలిస్తే వీటన్నింటికీ ఒకేసారి పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో వీటిలో కొన్నింటినైనా పూర్తి చేసి ఈనెల 21వ తేదీన నిర్వహించే సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. జిల్లాలో 33,526 ఇళ్లను గృహ ప్రవేశాల నాటికి సిద్ధం చేయాలని అధికారులు లక్ష్యంగా తీసుకున్నారు. ఇందులో ఇప్పటివరకు 14,833 ఇళ్లు (44.24 శాతం) పూర్తయ్యాయి. ఇంకా 18,693 ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది.

18 మండలాల్లో 50 శాతం దాటని లక్ష్యం

జిల్లాలో గృహ ప్రవేశాలకు తీసుకున్న లక్ష్యాలు చేరుకోవడంలో 18 మండలాలు తీవ్ర వెనుకబాటులో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలు 50 శాతం కూడా పూర్తి కాలేదు. శ్రీకాకుళం అర్బన్‌లో ఇళ్ల నిర్మాణాలు చాలా నత్తనడకన సాగుతున్నాయి. ఇక్కడ 1570 ఇళ్లను గృహ ప్రవేశాలను నాటికి సిద్ధం చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 290 (18.47 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. ఇచ్ఛాపురం అర్బన్ ప్రాంతంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ 880 మందితో గృహ ప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా తీసుకోగా 167 ఇళ్లు (18.98 శాతం) మాత్రమే సిద్ధమయ్యాయి. ఇచ్ఛాపురం మండలంలో 799 ఇళ్లను సిద్ధం చేయాలని నిర్ణయించగా 235 ఇళ్లు పూర్తయ్యాయి. సోంపేటలో 1382 ఇళ్లకు గానూ 431 ఇళ్లు (31.19 శాతం) సిద్ధమయ్యాయి. పలాస-కాశీబుగ్గ అర్బన్ ప్రాంతంలో గృహ ప్రవేశాల సమయానికి 1202 ఇళ్లను సిద్ధం చేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 363 ఇళ్లు పూర్తయ్యాయి. వజ్రపుకొత్తూరు మండలంలో 988 ఇళ్లకు గానూ 313 ఇళ్లు (31.68 శాతం), కవిటిలో 887 ఇళ్లకు 302 ఇళ్లు (34.05 శాతం), కంచిలిలో 1027 ఇళ్లకు 363 (35.35 శాతం) పూర్తయ్యాయి. మందసలో 2,457 ఇళ్లకు 922 (37.53 శాతం) గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాల విషయంలో ఆమదాలవలస అర్బన్ ప్రాంతం కాస్త మెరుగ్గా ఉంది. ఇక్కడ 662 ఇళ్లను గృహ ప్రవేశాల సమయానికి సిద్ధం చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 432 (65.26 శాతం) పూర్తయ్యాయి.

మౌలిక వసతుల కల్పనలోనూ వెనుకబాటే

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలోనూ వెనుకబాటు కనిపిస్తోంది. ప్రధానంగా తాగునీరు, విద్యుత్, రహదారుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు 14,833 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా 8,633 ఇళ్లకు (58.20 శాతం) తాగు నీటిని అందించగలిగారు. మొత్తం పూర్తయిన ఇళ్లలో 8,736 ఇళ్లకు (58.90 శాతం) విద్యుత్‌ను సరఫరా చేయగలిగారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు ఎ.బాబు

పక్కాగా ఓటర్ల నమోదు ప్రక్రియ

- పొరపాట్లను సరిద్దాలి
- ఎన్నికల పరిశీలకులు ఎ.బాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల నమోదు ప్రక్రియలో పొరపాట్లను సరిదిద్దాలని ఎన్నికల పరిశీలకులు ఎ.బాబు ఆదేశించారు. ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టిన ఓటర్ల నమోదు ప్రక్రియలో తొలగింపులు, చేర్పులను నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఓటర్ల నమోదులో పారామీటర్ అభివృద్ధి చేయాలన్నారు. అధికంగా తొలగింపులు, చేర్పులు ఉన్న పోలింగ్ బూత్‌ల్లో మొత్తం ఓటర్లు నిష్పత్తి చూడాలన్నారు. తిరస్కరించిన ఫారం-6, ఆధార్ ఫొటో అప్‌డేషన్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బూత్ లెవల్ పోలింగ్ అధికారులు ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో ప్రతి అంశాన్నీ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. బిఎల్ఒల పనుల పనితీరు ఆధారంగానే అక్రమాలకు తావు లేని ఓటర్ల జాబితా తయారవుతుందన్నారు. జిల్లాలో బిఎల్ఒల పనుల పురోగతి సంతృప్తికరంగా లేదన్నారు. నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పెషల్ సమరీ రివిజన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలక్ట్రోరల్ పరిశీలకులకు వివరించారు.

స్వీప్ కార్యక్రమంలో 18, 19 సంవత్సరాల వయసు గల 16,003 మందిని ఓటర్లుగా చేర్చినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. డూప్లికేషన్, డబుల్ ఎంట్రీ, మృతుల పేర్ల తొలగింపు, వలస ప్రాంతాల్లో నమోదు చేసుకున్న వారికి తిరిగి స్థానికంగా చేర్పించడం వంటి లోపాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ స్థాయి ఓటరు నమోదు అధికారులు ఎ.రాజేశ్వరి, జి.జయదేవి, సీతారామ్మూర్తి, బి.శాంతి, ఆర్.వెంకట్రామన్, ఎఇఆర్ఒలు పాల్గొన్నారు.

నకిలీ ఓటర్ల నమోదును అరికట్టాలి

ఓటర్ల నమోదు ప్రక్రియలో నకిలీ ఓటర్లను నమోదు చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల పరిశీలకులు ఎ.బాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇటీవల ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్ల నమోదు సమయంలో వేల సంఖ్యలో ఓటర్లు డబుల్ ఎంట్రీలు నమోదయ్యాయని గుర్తు చేశారు. విద్యార్హత లేని వారిని ఓటర్లుగా నమోదు చేసినట్లు చెప్పారు. ఓటరు నమోదు ప్రక్రియలో వాలంటీర్లను భాగస్వాములు చేయడంపై టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సురేష్‌బాబు సింగ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించి పలు మండలాల్లో మాన్యువల్ దరఖాస్తులను స్వీకరించడం లేదని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కళింగపట్నం తీరానికి శాశ్వత రక్షణ

- డ్రెడ్జింగ్ పనులకు రూ.5.55 కోట్లు
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - గార

సుందరమైన ప్రాంతంగా కళింగపట్నం బీచ్‌ను అభివృద్ధి చేయడానికి అనువైన రక్షణ చర్యల్లో భాగంగా రూ.5.55 కోట్ల వ్యయంతో డ్రెడ్జింగ్ పనులు చేపడుతున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం మత్స్యలేశం వద్ద నిర్మాణంలో ఉన్న గ్రోయిన్లను బుధవారం ఆయన పరిశీలించారు. సుమారు రూ.1.96 కోట్ల వ్యయంతో గ్రోయిన్లను చేపట్టడం ద్వారా సముద్రపు నీటిని వంశధార నదిలోకి రానీయకుండా అడ్డుకోవడంతో పాటు తీరాన్ని కోతకు గురికాకుండా రక్షించేందుకు తోడ్పడుతుందని తెలిపారు. వంశధార నది సముద్రంలో కలిసే చోట డ్రెడ్జింగ్ పనులు చేపట్టడం ద్వారా తీరాన్ని రక్షించుకునేందుకు వీలుంటుందన్నారు. తద్వారా ఈ ప్రాంతాన్ని బీచ్‌గా అభివృద్ధి చేసుకునేందుకు వీలవుతుందన్నారు. ఎంతోమంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి వీలుగా విశాలమైన ప్రదేశం ఉందని, తరచూ కోతకు గురికావడం వల్ల ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు కాలేదన్నారు. డ్రెడ్జింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు రక్షణ కోసం నిర్మిస్తున్న గ్రోయిన్లు పూర్తి చేయడం ద్వారా కోతల నివారణకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీరు సుగుణాకరరావు, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, ఎంపిపి రఘురాం, వైసిపి నాయకులు పీస శ్రీహరిరావు, ముంజేటి కృష్ణమూర్తి, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రోయిన్లను పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సిఎం ఒఎస్‌డి పేరుతో ఫోన్ కాల్స్

పోలీసులకు పట్టుబడిన నిందితుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి ఒఎస్‌డి పేరుతో పలువురిని మోసగిస్తున్న బుడుమూరు నాగరాజు అనే వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో వెల్లడించారు. వర్ధమాన రంజీ క్రికెట్ ఆటగాళ్లకు క్రికెట్ కిట్ల కోసం దేశంలోని పలు కార్పొరేట్ కంపెనీ కార్యాలయాలకు నాగరాజు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై స్కూటీపై అక్రమంగా గంజాయి తరలిస్తుండగా, టెక్కలి పోలీసులకు నాగరాజు మంగళవారం పట్టుబడ్డాడని పేర్కొన్నారు. ఆయన్ను విచారించగా కొన్ని నిజాలు వెలుగులోకి వచ్చాయి. చెడు వ్యసనాలకు, విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి ఎలాగైనా అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ తరహా మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. గూగుల్‌లో పలు కార్పొరేట్ కంపెనీలు, వాటి సిఇఒలు, ఆయా కంపెనీల ల్యాండ్‌లైన్ ఫోన్ నంబర్ల జాబితాను సేకరించి, ముఖ్యమంత్రి ఒఎస్‌డి కె.నాగేశ్వరరావు పేరుతో పాటు తెలంగాణ రాష్ట్ర మంత్రి కెటిఆర్ పిఎ పేరిట ఫోన్ కాల్స్ చేసినట్లు గుర్తించామని తెలిపారు. వారిని నమ్మబలికి, బెదిరింపులకు పాల్పడి పలు కార్పొరేట్ కంపెనీలు సిఇఒలు, మేనేజర్ల నుంచి పెద్దమొత్తంలో రూ.లక్షలను తన ఖాతాలకు బదిలీ చేయించుకుని మోసాలకు పాల్పడ్డాడని వివరించారు. నాగరాజుపై ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో పది కేసులు నమోదయ్యాయని తెలిపారు. బెయిల్‌పై బయటకు వచ్చి ఈవిధమైన మోసాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. ఈ విధమైన ఫోను కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, సమాచారాన్ని స్థానిక పోలీసులకు అందించాలని కోరారు.

అభివాదం చేస్తున్న నాయకులు

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగరంలోని మండలవీధిలో గల ప్రధానోపాధ్యాయుల సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో ఫ్యాప్టో చైర్మన్‌గా ఎపిటిఎఫ్(257) జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్, సెక్రటరీ జనరల్‌గా డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కొమ్ము అప్పలరాజు ఎన్నికయ్యారు. కో చైర్మన్లుగా బిటిఎ అధ్యక్షులు పేకేటి రామారావు, ఎస్‌సి, ఎస్‌టి టిఎఫ్ ప్రధాన కార్యదర్శి కొప్పల డేనియల్, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు, ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణమూర్తి, ఎపిటిఎఫ్ (1938) ప్రధాన కార్యదర్శి టి.చలపతిరావు, కోశాధికారిగా ఎస్.గోవింద రాజులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఐక్య ఉద్యమాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమ నిమిత్తం బలమైన ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఫ్యాప్టో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ పెంపు

ప్రజాశక్తి - ఆమదాలవలస / శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్‌ను దశల వారీగా పెంచుతున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆమదాలవలసలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో స్పీకర్ సీతారాం, పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో గార మండలంలోని పెన్షన్‌దారులకు బుధవారం పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.1,000 ఉన్న పింఛన్‌ను ఎన్నికల ముందు రూ.రెండు వేలకు పెంచారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక దశల వారీగా రూ.మూడు వేలు పెన్షన్ ఇస్తామన్న హామీ మేరకు ఇప్పటికి మూడుసార్లు పెంచినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమ పాలన నూతన ఒరవడిని ప్రజలు గమనించాలని కోరారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అవి పేదలు, పెత్తందారుల మధ్యగానే భావించాలన్నారు. ఎందరు ఏకమైనా జగన్ జన సంక్షేమ ప్రభంజనంలో కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, తమ్మినేని వాణి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, గార ఎంపిపి జి.రఘురాం, ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ ఎం.రేణుక, వైసిపి నాయకులు పీస శ్రీహరి, బి.రమేష్‌కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లను పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

జగన్ నియంతృత్వ పాలన

- మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి
- జిఒ నంబరు 1 ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. రోడ్లపై ర్యాలీలు, సభలను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబరు 1కు వ్యతిరేకంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద టిడిపి ఆధ్వర్యాన బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. జిఒ 1 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలుస్తున్న చంద్రబాబు పర్యటనలను అడ్డుకునేందుకు ప్రభుత్వం చీకటి జిఒలను తీసుకొచ్చిందని విమర్శించారు. కందుకూరు, గుంటూరు ఘటనలపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు పర్యటనలు, లోకేష పాదయాత్రను అడ్డుకునేందుకే ప్రభుత్వం పోలీసులను సభలకు వెళ్లనీయకుండా తోపులాటలకు అవకాశం కల్పించిందని ఆరోపించారు. చంద్రబాబు కుప్పం పర్యటనను అడ్డుకునేందుకు వందల మంది టిడిపి కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జీ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేస్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, పి.ఎం.జె బాబు, జామి భీమశంకరరావు, కవ్వాడి సుశీల, రమ, పలువురు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

'వన్ మెన్ కమిషన్ ఏకపక్షం'

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బెంతుఒరియా, బోయ, వాల్మీకి సామాజిక తరగతులపై అధ్యయనానికి జిల్లాలో ఈనెల ఐదు, ఆరు తేదీల్లో పర్యటించనున్న వన్ మెన్ కమిషన్ ఏకపక్షమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు వాబ యోగి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యటనను ఆదివాసీ సంఘాలు స్వాగతిస్తున్నా, కమిషన్ ఆదివాసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయకుండా నకిలీ బెంతు ఒరియా గ్రామాల్లో పర్యటించి వినతలు స్వీకరించడం సరికాదని తెలిపారు. జిల్లాలో బెంతు ఒరియాలు లేరని గతంలో టిసిఆర్‌టిఐ కమిటీ తేల్చిచెప్పిందని గుర్తు చేశారు. నిజమైన బెంతు ఒరియాలకు, జిల్లాలో బెంతు ఒరియాలుగా చెప్పుకుంటున్న వారికి ఆచార వ్యవహారాలతో ఎటువంటి సంబంధం లేదని, వీరంతా వడ్డి సామాజిక తరగతికి చెందిన వారని అప్పటి సత్యపాల్ కమిటీ కూడా చెప్పిందని తెలిపారు. వైసిపి అధికారంలోకొచ్చాక జెసి శర్మతో నియమించిన వన్ మెన్ కమిషన్ నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయకుండా ఆదివాసీలను మభ్యపెడుతోందని విమర్శించారు. గతంలో అనేక కమిషన్‌లు పర్యటనకు వచ్చినప్పుడు నకిలీ బెంతు ఒరియా గ్రామాల్లో పర్యటిస్తూ ఆదివాసీ సంఘాల నుంచీ వినతిపత్రాలు స్వీకరించారని గుర్తు చేశారు. జిల్లాకు వస్తున్న శ్యామ్యూల్ ఆనంద్ కుమార్ వన్ మెన్ కమిషన్ కేవలం నకిలీ బెంతు ఒరియా గ్రామాల్లో పర్యటిస్తారని కలెక్టర్ ప్రకటించడం సరికాదన్నారు. ఆదివాసీ సంఘాల వినతిపత్రాలనూ కమిషన్ స్వీకరించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ డి.వి.విద్యాసాగర్ అన్నారు. జిల్లాలో సుమారు 30వేల మంది వికలాంగులకు ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీకి పెన్షన్ అందిస్తోందని, వారి జీవనానికి పెన్షన్ ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. జెడ్‌పి సమావేశ మందిరంలో బుధవారం వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన లూయిస్ బ్రెయిలీ 214వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వికలాంగులకు ప్రయోజనం చేకూర్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అందులో వికలాంగులు భాగస్వాములుకావాలన్నారు. వికలాంగుల శాఖ ద్వారా వారికి అడిగిన వెంటనే ట్రై సైకిళ్లు, ఇతర ఉపకరణాలు అందించడం జరుగుతోందన్నారు. వికలాంగుల శాఖ ఎడి ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బ్రెయిలీ 214వ జన్మదినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో వికలాంగులకు 239 పోస్టులు మంజూరు కాగా, ఇందులో 132 పోస్టులు అంధులకు కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 39 ల్యాప్‌టాప్‌లు అందించామన్నారు. 800మందికి బస్ పాస్‌లు మంజూరు చేశామన్నారు. జిల్లాలో అంధుల పాఠశాల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడి, చర్యలు తీసుకుంటామన్నారు. రాగోలు హైస్కూల్ ఉపాధ్యాయులు రంగారావు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధుల ఆశాజ్యోతి అని కొనియాడారు. లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బ్రెయిలీ లిపిలో చదువుకుంటామంటే తనవంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లాకు ఒక బ్లైండ్ స్కూల్ అవసరమని కోరారు. వికలాంగుల సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు అధికారులు అందిస్తున్న సహాయ, సహకారాలను వివరించారు. విహెచ్ విద్యార్థిని యశోధ, శ్రీనివాసరావు, తదితరులు ప్రత్యేక పాటలు పాడి అలరించారు. అంతకు ముందు లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. బ్రెయిలీ క్యాలండరును ఆవిష్కరించారు. ఆటలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాసరావు, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్రం అధికారి శ్రీనివాసరావు, పర్యాటకశాఖ అధికారి నారాయణరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

1861 చట్టం 2023లో చెల్లదు

ప్రజాశక్తి - ఆమదాలవలస / కొత్తూరు

కాలం చెల్లిన 1861 బ్రిటిష్ పోలీస్ చట్టాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబరు 1 స్వతంత్ర భారతదేశంలో చెల్లదని ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ (ఎపిసిఎల్ఎ) రాష్ట్ర నాయకులు బొడ్డేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా నియంత్రించాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే 144, 30 సెక్షన్లను నిరంతరం అమలు చేస్తూ పౌరుల ప్రజాస్వామిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు.

జిఒను ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం రోడ్లపై ర్యాలీలు, సభలపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబరు 1ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కందుకూరు, గుంటూరు ఘటనలను సాకుగా చూపించి ప్రజా హక్కులను హరించడం సరికాదన్నారు.

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

జగనన్న ఇళ్లు నిర్మించుకోవాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

రాష్ట్ర ప్రభుత్వం కనివిని ఎరగని విధంగా పేదలకు ఇళ్లు మంజూరు చేసిందని, లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్లను నిర్మించుకోవాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండల కేంద్రం బూర్జలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులకు దశల వారీగా ప్రభుత్వం డబ్బులను జమ చేస్తుందని అన్నారు. అలాగే గడపగడపలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని, దీంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మామిడివలస ఎంపిటిసి జి.రాంబాబు, బూర్జ సర్పంచ్ ఏగు అనురాధ, కృష్ణ పాల్గొన్నారు.

నేడు శాప్ లీగ్ అథ్లెటిక్స్ ఎంపికలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాస్థాయి శాప్ లీగ్ అథ్లెటిక్స్ ఎంపిక టోర్నమెంట్‌ను గురువారం ఉదయం ఉదయం 9 గంటలకు నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించనున్నట్టు చీఫ్ కోచ్ ఎం.మాధురీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా స్థాయి ఎంపికలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న స్త్రీ, పురుష క్రీడాకారులు హాజరు కావాలని కోరారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొవడానికి శాప లీగ్ యాప్ ద్వారా రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 8500887999 సెల్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ట్రోఫీని అందజేస్తున్న గాంధీ

యువత క్రీడల్లో రాణించాలి

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాంధీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. మండలంలోని గాజులకొల్లివలసలో వారం రోజుల నుంచి నిర్వహించిన శ్రీరామాంజనేయ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీలో 23 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలో ఎఆర్ బేకరీ జట్టు రన్నర్‌గా, గాజుల కొల్లివలస జట్టు విన్నర్‌గా నిలిచాయి. చీమలవలస జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. వచ్చే రోజుల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తున్న తరుణంలో చక్కగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పేడాడ వైకుంఠరావు, వైసిపి నాయకులు చింతాడ శివ, పైడి విజయరామరాజు, బగాది నేతాజీ, గురుగుబెల్లి రాజశేఖర్, అరవింద్, సంజయ్, తేజ, రాకేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై పెరిగిన నమ్మకం

రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కోవిడ్ సమయంలో సమర్థవంతంగా ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు అందించడానికి మెరుగైన వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చామని, దీనివల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కుదిరిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలోని అరసవల్లి, కొయ్యాన కన్నయ్య కాలనీలో రూ.1.20 కోట్లతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపర్చడానికి జిల్లా కేంద్రంలోని రిమ్స్ రూపు రేఖలు మార్చేందుకు ప్రయత్నించామని తెలిపారు. ఇప్పుడు అక్కడ భిన్నమైన వాతావరణం నెలకొని ఉందన్నారు. కోవిడ్ సమయంలో ప్రజా వైద్యం వల్ల అనేక మంది ప్రాణాలు కాపాడగలిగామన్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలకు అర్బన్ హెల్త్ సెంటర్లు ఎంతో కీలకంగా పనిచేశాయని గుర్తు చేశారు. ఇప్పుడు 65 వైద్య పరీక్షలు అర్బన్ హెల్త్ సెంటర్లలో అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లు నగర పరిధిలో సేవలు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి ఆశాదీపిక, తెలుగు సూర్యనారాయణ, గంగు సీతాపతి, తెలుగు రమేష్, రాయపల్లి అర్జున్, వడ్డి ఉదయ్ పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన

సాంకేతికతతో అధిక దిగుబడులు

సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

సంతబొమ్మాళి : రైతులు సాంకేతిక పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కూరగాయల రైతు ఉత్పత్తిదారుల సంస్థ తరుపున 10 మంది రైతులు పొలాల్లో ఏర్పాటు చేసిన బోరు బావులు, నేల బావుల్లో విద్యుత్ మోటార్లను టెక్కలి సబ్ కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కాయకూరలు, రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ కోత మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1975లో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా గ్రూపులు పొదుపు చేయడం ద్వారా ప్రపంచ స్థాయిలో పేరు, ప్రఖ్యాతలు పొందాయని అన్నారు. ఎఫ్‌పిఒల ద్వారా రైతులు సంఘాలుగా ఏర్పాడడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చని అన్నారు. హరిత విప్లవం ద్వారా భారతదేశం దిగుమతులు చేసుకునే స్థాయి నుండి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరిందన్నారు. యాజమాన్య పద్ధతులే కాకుండా పని ముట్లలో కూడా సాంకేతిక పద్ధతులు పాటించాలని సూచించారు. వరిలో శ్రీ వరి సాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. విత్తనోత్పత్తి పథకం ద్వారా రైతులే విత్తనాలు తయారు చేసుకోవచ్చున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని అన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ కె.కృష్ణారావు మాట్లాడుతూ వేరు శనగ, వరిసాగులో సాంకేతిక యాజమాన్య పద్ధతులపై ఎఫ్‌పిఒలో ఉన్న 15 మంది రైతులకు వారం రోజులు శిక్షణ ఇవ్వడం జరిగిందదన్నారు. వేరుశనగ బొంగరం సాలులో వేయకుండా వరుసుల్లో నాటాలని అన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఎడిఎ అర్.రవిప్రకాష్, తహశీల్దార్ చలమయ్య, ఎఒ శ్రీలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి కె.సునీత, విద్యుత్‌శాఖ ఎఇ ఎం.శివకుమార్, సర్పంచ్ ప్రతినిధి కె.అప్పారావు, ఎంపిటిసి ప్రతినిధి ఎస్.సోమేశ్వరరావు, జీడి రైతుల ఎఫ్‌పిఒ చైర్మన్ చల్ల జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ లాండింగ్ సెంటర్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి- నౌపడ

భావనపాడు ఫిషింగ్ హార్బర్ వద్ద బృందం సభ్యులు

సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్రంలో ఫిష్ లాండింగ్ సెంటర్ ఏర్పాటుకు ఎమ్మెస్ స్వామినాథన్ ఫౌండేషన్ ప్రతినిధి నేతాజీ ఆధ్వర్యంలో మత్స్యశాఖ అధికారుల బృందం బుధవారం స్థల పరిశీలన చేశారు. చేపలు ఆవాసానికి స్థలం అనువైనదా? కాదా? పరిశీలించారు. ఫిష్ లాండింగ్ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించారు. తీరంలోని నీరు, రోడ్డు మార్గం, విద్యుత్ అన్ని సదుపాయాలు వీలుగా ఉండడంతో సానుకూలంగా స్పందించారు. ఈ నిర్మాణానికి భావనపాడు ఫిషింగ్ హార్బర్ వద్ద స్థలం అనుకూలమని, దీనికి పూర్తిగా సహకరిస్తామని సర్పంచ్ మోహన్‌రెడ్డి అధికారుల బృందానికి తెలియజేశారు. దీనిపై పూర్తి పరిశోధన చేసి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఫిష్ ఆల్ డైరెక్టర్ వాల్వేజీ తెలియజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, సొసైటీ ప్రెసిడెంట్ ఆదినారాయణ, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ ప్రకాష్, పలువురు మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక చరిత్రను విస్తరించాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

టెక్కలి: ఉద్యమాల పురిటి గడ్డ శ్రీకాకుళం జిల్లా అని, చారిత్రాత్మకమైన చరిత్ర కలిగిన జిల్లా చరిత్రను, ఉద్యమ రూపాలను, పోరాటాలను ఈ నాటి తరానికి వివరించాల్సిన అవసరం ఉందని, స్థానిక చరిత్రను విస్తరించాల్సి ఉందని ఎంపిపి ఎ.సరోజనమ్మ అన్నారు. విప్లవసేనాని వీరగున్నమ్మ చిత్ర ఆడియో ఫంక్షన్ స్థానిక బిఎస్‌జెఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ వీరుగున్నమ్మను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సినీ నిర్మాత, దర్శకుడు గూన అప్పారావు మాట్లాడుతూ చిన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలని, ఈనెల 6న సినిమా విడుదలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు పి.రమేష్, బి.హరి, సిపిఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు, కె.ఎల్లయ్య, బిజెపి నాయకులు హెచ్.ఉదయ్‌భాస్కర్, సిపిఐ నాయకులు ఎ.షణ్ముఖరావు, యడ్ల గోపి, దూసి ఆంధ్రాస్టాలిన్, గణపతి, తాతయ్య, మల్లారెడ్డి పద్మనాభరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు డైరీని అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

రెవెన్యూ ఉద్యోగుల డైరీ అందజేత

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం ఆధ్వర్యాన ముద్రించిన కేలండర్లు, డైరీలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి ఎం.నవీన్, ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతిలకు బుధవారం అందజేశారు. కలెక్టరేట్‌లోని వారి వారి ఛాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిసి వీటిని అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తోడ్పాటు అందించాలని రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి జి.ఎల్.ఈ.శ్రీనివాసరావు, శ్రీకాకుళం డివిజన్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.గణపతిరావు, గార తహశీల్దార్ సనపల సుధాసాగర్ పాల్గొన్నారు.

సిఐ బాధ్యతల స్వీకరణ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఈశ్వరచంద్ర ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళంలోని యుపిఎస్ నుంచి ఇచ్ఛాపురం సిఐగా నియమించారు. ఇప్పటివరకు సిఐగా పని చేసిన సతీష్‌కుమార్‌ను శ్రీకాకుళం దిశ ఉమెన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈయనను పలువురు అభినందించారు. వైసిపి కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

ఎన్‌జిఒ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నూతన సంవత్సర టేబుల్ టాప్ కేలండర్, డైరీలను రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యాన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాలూకా, టౌన్, జిల్లా అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం కావడంతో శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మంత్రికి అసోసియేషన్ నాయకులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా, టౌన్ ఎన్‌సిఒ అసోసియేషన్ నాయకులు కంఠ జయరావు, కాయల శ్రీనివాసరావు, బడగల పూర్ణచంద్రరావు, టి.సోమేశ్వరరావు, బరకాల నవీన్, శబీనా బేగం, గణపతి, నారాయణరావు పాల్గొన్నారు.

గోదాం వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు

నల్ల బ్యాడ్జీలతో హమాలీల నిరసన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పెరిగిన కూలి రేట్లు చెల్లించాలని కోరుతూ హమాలీలు నల్ల బ్యాడ్జీలతో బుధవారం నిరసన తెలిపారు. ఎపి సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యాన కోటబొమ్మాళి సివిల్ సప్లై గోదాములో పని చేస్తున్న హమాలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీలకు బస్తాలు లోడింగ్, అన్‌లోడింగ్‌కు క్వింటాకు చెల్లించే కూలి రేట్లను ప్రతి మూడేళ్లకు ఒక్కసారి పెంచేందుకు ఒప్పందం జరిగిందన్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసిందని, ఆ మేరకు కూలి రేట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి 11 నెలలు కావస్తున్నా బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. అరకొరగా వచ్చిన కూలితో కుటుంబ పోషణ కష్టతరమని చెప్పారు. కార్యక్రమంలో కొయ్యాన రాములు, ఎం.నారాయణరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ జోగి రాములమ్మ

గ్రామాభివృద్ధికి సహకరించాలి

సర్పంచ్ జోగి రాములమ్మ

సంతబొమ్మాళి: మండలంలోని జగన్నాథపురం పంచాయతీ అభివృద్ధి కోసం ప్రజలు సహకరించాలని సర్పంచ్ జోగి రాములమ్మ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో కాలువలు, సిసి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి జొన్న సవరరాజు, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు పుక్కళ్ల లక్ష్మణరావు, వైసిపి నాయకులు లండ రామారావు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్త, వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆహారాన్ని అందజేస్తున్న సభ్యులు

సత్యసాయి వాహనం ప్రారంభం

పొందూరు: మండలంలోని తోలాపి సత్యసాయి వాహనాన్ని ఆ సంస్థల జిల్లా అధ్యక్షులు యెన్ని లింగరాజు బుధవారం ప్రారంభించారు. అనంతరం మండలంలోని తోలాపి, కింతలి, కనిమెట్ట, కాజీపేట, దల్లవలస, అలమాజీపేట గ్రామాల్లోని 85 మంది వృద్ధులకు ఆహారాన్ని అందజేశారు. ఈ మేరకు శ్రీకాకుళం జోనల్ కన్వీనర్ పప్పల నాగేశ్వరరావు రూ.20 వేలు విరాళంగా అందజేశారు. జిల్లా సేవాదల్ కో-ఆర్డినేటర్ సూర రామచంద్రరావు, స్కిల్ డెవలెప్‌మెంట్ ఇన్‌ఛార్జి బోయిన నరసింహమూర్తి, మురపాక వాసుబాబు, పి.భారతీరమేష్, యూత్ కో-ఆర్డినేటర్ యువరాజ్, సేవాదల్ సభ్యులు శ్రీనివాసరావు, హరి పాల్గొన్నారు.

తవుడు మృతి తీరని లోటు

పోలాకి : ఉరజాం మాజీ సర్పంచ్ కణితి తవుడు మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తవుడు అంత్యక్రియల్లో బుధవారం పాల్గొన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కృష్ణదాస్ మాట్లాడుతూ నిజాయితీగల సీనియరు రాజకీయ నాయకుడిని కోల్పోయామని అన్నారు. అంత్యక్రియల్లో డిసిసిబి చైర్మన్ కె.కృష్ణారావు, సర్పంచ్ కణితి సత్తిబాబు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు తోడ్పాటు

విసితో మాట్లాడుతున్న సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాలల హక్కుల పరిరక్షణకు మేధావులు తగిన సూచనలు చేయాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. నగరంలోని పిఎన్ కాలనీలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యునివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావును ఆయన ఇంట్లో బుధవారం కలిసి తగిన సూచనలు అందించాలని కోరారు. కమిషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు అన్ని తరగతుల నుంచి సూచనలు కోరుతున్నట్టు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు సంబంధిత అంశాలు, చట్టాలు, సుమోటాగా స్వీకరిస్తున్న కేసులు, అంశాలు, ఆదేశాలు అమలుపై నిశిత దృష్టి, కమిషన్ నుంచి ప్రభుత్వానికి అందిస్తున్న ప్రతిపాదనలపై ప్రస్తుత పరిస్థితిని వివరించారు. వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ బాలల్లోను, వారి తల్లిదండ్రుల్లోను నైతిక స్థైర్యం, ధైర్యం నింపేందుకు కమిషన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. కమిషన్ పురోభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆయనతో పాటు చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కో-కన్వీనర్ పి.శేఖర్, ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మొదలవలస వాసుదేవకుమార్, బెండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేకుల షెడ్ తొలగింపు

- జెసిబిని అడ్డుకున్న బాధితుడు
- కమిషనర్ వస్తేనే జెసిబిని పంపిస్తామన్న స్థానికులు

జెసిబిపై కూర్చొని కూల్చివేతను అడ్డుకుంటున్న బాధితుడు

ప్రజాశక్తి- పలాస

స్థానిక మారుతీనగర్‌కు చెందిన బాసూరి హరీష్‌కుమార్ తన స్థలంలో వేసిన రేకుల షెడ్‌ను మున్సిపల్ అధికారులు బుధవారం జెసిబితో దౌర్జన్యంగా తొలగించారు. దీనిపై బాధితుడు హరీష్‌కుమార్ ఎందుకు తొలగించారని నిలదీయగా మున్సిపల్ రోడ్డును ఆక్రమించి షెడ్ వేయడంతో తొలగించామని చెప్పారు. బాధితుడు మాట్లాడుతూ తాను 2020లో స్థలాన్ని కొనుగోలు చేశానని, దానికి సంబంధించిన పత్రాలు తన వద్ద ఉన్నాయని మున్సిపాలిటీకి విఎల్‌టి టాక్స్ ఎందుకు కట్టించుకున్నారని ప్రశ్నించాడు. ఈ స్థలంపై గొడవలు ఉన్నాయని, దీనిపై కోర్టు నాకు ఇంజక్షన్ కూడా ఇచ్చిందని చెప్పాడు. నా స్థలంలో రేకుల షెడ్ వేసుకుంటే ఎందుకు తొలగించారని మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. చివరకు మున్సిపల్ సిబ్బంది, బాధితుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో హరీష్ కుమార్ మున్సిపల్ జెసిబిపై కూర్చుని నిరసన తెలిపాడు. బాధితునికి అండగా స్థానికులు మద్దతు పలికారు. స్థలం వద్ద టెంట్ వేసి కూర్చుని నిరసన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, లొడగల కామేశ్వరరావు, విఠల్ ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడు హరీష్ కుమార్‌కు అండగా నిలిచారు. ఈ ఘటనపై కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది అక్కడనుంచి వెనుతిరిగారు. అయితే జెసిపి మాత్రం ఇచ్చేది లేదని, కేసులు పెట్టుకుంటే పెట్టుకోండి అంటూ బాధితుడు తేలు చెప్పారు మున్సిపల్ కమిషనర్ వస్తే తప్ప జెసిపి ఇచ్చేది లేదంటూ స్పష్టం చేశారు. ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ వివరణ కోరగా మునిసిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆ స్థలం మున్సిపల్ రోడ్డు చెప్పడం వల్లే తాము సిబ్బందిని పంపించి పునాదితో పాటు రేకుల షర్టు తొలగించడం జరిగిందని చెప్పారు.

మృతుల కుటుంబాలకు అండ

ప్రజాశక్తి- పలాస

పరామర్శిస్తున్న గౌతు శిరీష

పలాస, మందస మండలాల్లోని మృతుల కుటుంబాలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష బుధవారం పరామర్శించారు. మండలంలోని గురుదాసుపురం గ్రామానికి చెందిన కదంబాల సరస్వతి, జోగ ధర్మారావు, బోడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల లక్ష్మణరావు, పలాస మున్సిపాలిటీ అంతరకుడ్డకు చెందిన అట్టాడ తులసమ్మ, మందస మండలం అంబుగాంకు చెందిన కె.భగీరథి, వై.జనార్ధన ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలను శిరీష పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్, తెలుగు యువత మండల అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, జినగ ధర్మారావు, కుత్తుమ ప్రకాష్, సార జోగారావు, మురిపింటి కుమార్‌రాజు, ఎల్.రుద్రమ్మ, తదితరులు ఉన్నారు.

బంటుపల్లిలో గ్రామసభ

మాట్లాడుతున్న సర్పంచ్ రజని

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి పంచాయతీ అభివృద్ధి అందరూ సహకరించాలని సర్పంచ్ నడుకుదిటి రజని అన్నారు. బంటుపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ అభివృద్ధికి పలు అంశాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింహాచలం, ఎంపిటిసి టి.సంజీవ్‌రావు, వైస్ సర్పంచ్ సత్యవతి, వార్డు మెంబర్లు జి.కరుణ, గురాల జగన్నాథరావు నారాయణరావు పాల్గొన్నారు.

లలితారెడ్డికి సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు

లలితారెడ్డి

జి.సిగడాం : మండలంలోని కస్తూరిబా విద్యాలయంలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న లలితారెడ్డికి సావిత్రీబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు-23కు ఎంపికైంది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బిసి మహిళా సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. యోగ్యతాపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. సమాజ శ్రేయస్సుకు విశిష్ట సేవలందించినందుకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఈమె హరివిల్లు, కవితా పుష్పమాలికలు, లలితకథా సాగరం పుస్తకాలను రాశారు. అంబేద్కర్ రత్నా పురస్కారం, జ్ఞానోత్సవ పురస్కారం, ఉగాది పురస్కారం, సెట్‌శ్రీ పురస్కారం, ఇలా మరెన్నో అవార్డులను పొందారు. లలితారెడ్డికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించడంపై ఎస్ఒ దాసరి ఉషా రత్నకుమారి, సిబ్బంది, తెలుగు రచయితల వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు అభినందనలు తెలిపారు.

క్రైమ్ కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కవిటి

చెట్టుకు వేలాడుతున్న మృతదేహం

మండలంలోని భైరిపురం లక్ష్మణ్ ట్యాంకు సమీపంలోని ఓ మర్రి చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మృతదేహం వేలాడడాన్ని స్థానికులు గుర్తించి విఆర్‌ఒకు సమాచారం అందజేశారు. విఆర్ఒ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న మృతదేహానికి పంచనామా నిర్వహించి ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఎస్ఐ రాము మాట్లాడుతూ ఇంతవరకు చనిపోయిన వ్యక్తి గురించి ఎటువంటి వివరాలు తెలియరాలేదని, సంబంధిత వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగం పేరుతో మోసం


ఫిర్యాదు చేస్తున్న యువకుడు

పొందూరు: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి నిరుద్యోగ యువకుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి తప్పుడు నియామక పత్రాలు ఇచ్చారు. నియామక పత్రాలు పట్టుకుని వెళ్లే అటువంటి ఉద్యోగాలు ఏమీ లేవని చెప్పడంతో తాము మోసపోయామని పొందూరు పంచాయితీ పరిధిలోని లక్ష్మీపేటకు చెందిన కొవెల నాగరాజు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుని ఫిర్యాదు మేరకు... పొందూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, ఆమె భర్త గవరాజులు ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సుచిత్ర ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన లావేరు మండలం కిచెన్ గార్డెన్ మండల సమన్వయకర్తగా ఇప్పిస్తానని, నెలకు రూ.15 వేలు జీతం అందుతుందని నమ్మబలికి రూ.2 లక్షలు తీసుకున్నారని అన్నారు. గతేడాది 16న నియామక ఉత్తర్వు పత్రాలను ఇవ్వడంతో అదే నెల 20న ఉద్యోగంలో చేరాలని తెలిపారని అన్నారు. తీరా అక్కడకు వెళ్తే ఇక్కడ అటువంటి ఉద్యోగాలు లేవని అధికారులు తెలపడంతో మోసపోమాయని గ్రహించి సర్పంచ్, ఆమె భర్తను అడిగామని పేర్కొన్నారు.

దీంతో ఇచ్చిన మొత్తాన్ని తిరిగి చెల్లించేస్తామని చెప్పి ఇంతవరకూ తిప్పించుకుంటున్నారని, ఆ మొత్తాన్ని ఇప్పించి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. జిల్లాలో కిచెన్‌గార్డెన్ ఉద్యోగాలు, సమన్వయకర్తల ఉద్యోగాలు పేరుతో నిరుద్యోగ యువకుల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు రూ.లక్షల్లో వసూలు చేసి పొందూరుకు చెందిన ఓ ఫౌండేషన్ నిర్వాహకుడికి అప్పగించినట్లు సమాచారం. ఈ ఉద్యోగాలు పేరుతో పలు ప్రాంతాల్లో ఎంతో మంది అమాయకులు నష్టపోయారని, వారంతా బయటకు వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష

ఆమదాలవలస : బంధించి కొట్టారన్న నేరంపై ఓ వ్యక్తికి మూడు నెలలు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానాను విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి తీర్పునిచ్చారని కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన అంబళ్ల రామకృష్ణకు సరుబుజ్జిలి మండలం కొత్తకోటకు చెందిన డోల వెంకటేశ్వరరావు మధ్య చికెన్ వ్యాపారానికి సంబంధించిన లావాదేవీల గొడవ అప్పట్లో జరిగాయి. దీంతో వెంకటేశ్వరరావును రామకృష్ణ తన ఇంటి వద్ద బంధించడంతో పాటుగా కొట్టాడు. దీంతో వెంకటేశ్వరరావు 2016 ఏప్రిల్ 30న 108 వాహనంపై జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రికి వైద్యం కోసం వెళ్లారు. అవుట్ పోస్టు పోలీసుల సమాచారం మేరకు అప్పటి స్థానిక ఎఎస్ఐ మెట్ట సుధాకరరావు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ కోన గోవిందరావు కేసు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విన్న కోర్టు నేరం రుజువు కావడంతో నిందితునికి మూడు నెలల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ.. జడ్జి తీర్పునిచ్చారు.

ప్రీ రిలీజ్ చేస్తున్న మంత్రి అప్పలరాజు

'వీర గున్నమ్మ' సినిమా ప్రీ రిలీజ్

ప్రజాశక్తి- పలాస

రైతంగా వ్యతిరేక విధానాలపై మందస జమీందారీ, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాగించిన వీరోచిత పోరాటంలో ప్రాణాలను సైతం లెక్కచేయని వీర గున్నమ్మ పోరాట త్యాగాలు ఇతివృత్తంగా రూపొందించిన విప్లవ సేనాని వీర గున్నమ్మ సినిమాని ప్రతిఒక్కరు ఆదరించాలని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం రాత్రి విప్లవ సేనాని వీర గున్నమ్మ సినిమా ప్రీ రిలీజ్‌ను ఆవిష్కరించారు. ముందుగా చిన్నారులు నృత్యాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వీరవనిత సాసుమాన వీర గున్నమ్మ బ్రిటిష్ వారిని తన ప్రాణాలను ఎదిరించి తన ప్రాణాలు కోల్పోయిందని, ఇంత చరిత్ర కలిగిన మందస ప్రాంతంలో జరిగిన పోరాటంపై ఇతివృత్తంగా తీసిన విప్లవసేనాని వీర గున్నమ్మ సినిమాని ఆదరించాలని కోరారు. ఇటువంటి వీర వనితలపై సినిమా తీయడం ఆనందంగా ఉందన్నారు. ఆమె కూడా మన ప్రాంతం కావడం విశేషమన్నారు. జరిగిన కథను సినిమాగా తీయడం ద్వారా భవిష్యత్ తరానికి జరిగిన ఘటనలు తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇటువంటి సినిమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు ప్రతిఒక్కరూ వీర గున్నమ్మ సినిమా చూసి ప్రోత్సహించాలన్నారు. ఈనెల 6వ తేదిన సినిమా రిలీజ్ కాబోతుందని, జిల్లాలోని పలాసలో ఎస్‌వి మాక్స్, మందసలో మహేంద్రతో పాటు సుమారు ఆరు థియేటర్లలో సినిమా వేస్తున్నామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బి.కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరావు, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

డ్వాక్రా బజారును వినియోగించుకోవాలి

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయం శక్తి సంఘాల్లో సభ్యులు తీసుకున్న రుణాల నుంచి తయారు చేస్తున్న వస్తువులను మార్కెట్ చేసుకోవడానికి వీలుగా శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలోని మున్సిపల్ హైస్కూల్ జిల్లాస్థాయిలో ఎగ్జిబిషన్ కం సేల్ నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల మహిళా సమాఖ్యలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తయారు చేస్తున్న నాణ్యమైన వస్తువులు కొనుక్కోవడానికి, మనం తయారు చేసిన వస్తువులు అమ్ముకోవడానికి సిక్కోలు డ్వాక్రా బజార్‌ను ఈనెల 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రేణుక, వేణమ్మ, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు ,గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మాట తప్పరు.. మడమ తిప్పరు

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి- కవిటి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చరిత్రలోనే మాట తప్పడం, మడమ తిప్పడం ఉండదని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక అగ్నికుల క్షత్రియ భవనంలో బుధవారం నూతన పింఛన్లను ఎంపిపి కడియాల పద్మతో కలిసి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి అంశాన్నీ ఈ మూడు నెలల్లో తూచా తప్పకుండా పూర్తి చేశారని అన్నారు. ప్రతిపక్షాలకు ఏం చేయాలో తెలియక మాట తప్పుతున్నారు, మడమ తిప్పుతున్నారు అంటూ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. దూగానపుట్టుగలో సర్పంచ్ దూగాన భద్రాచలం పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త పి.సాయిరాజ్, పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపిపి కడియాల పద్మ, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, ఎఎంసి చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు పూడి లక్ష్మణరావు, బర్ల నాగభూషణం, ఎన్ని అశోక్, ఎంపిడిఒ పైలా సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పోలాకి సర్పంచ్ మజ్జి రమణమ్మ అన్నారు. బుధవారం వెదుళ్లవలస గ్రామంలో నూతన పింఛన్లు పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రూ.2750 పింఛను ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, ఉప సర్పంచ్ బరాటం కృష్ణారావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని నగరంపల్లిలో ప్రభుత్వం పెంచిన పింఛన్లను పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన పింఛను ప్రతి నెలా 1వ తేదీన పెన్షనర్లకు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి బమ్మిడి మోహనరావు, ఎం.గోపి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడులో నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ ఎన్.చిన్నమ్మడు బుధవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నూతన పింఛన్లు అందిస్తుంటే టిడిపి నాయకులు పింఛన్లు తొలగించారని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: మండలంలోని బొప్పాయిపురం గ్రామ సచివాలయంలో బుధవారం నూతన పింఛన్లను సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ డిడిఒ పాల రవికుమార్‌రెడ్డి, వర్ధన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంచిన పెన్షన్ సొమ్ములను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లావేరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన 220 పింఛన్ల బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి లొట్ట అమ్మదమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల చైతన్యనాయుడు, ఎంపిడిఒ విశ్వేశ్వరరావు, వైస్ ఎంపిపి ఎల్.శ్రీనివాసరావు, మండల కన్వీనర్ బి.రాజనాయుడు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని కృష్ణాపురం సచివాలయం పరిధిలోని గొర్లెపేటలో వైఎస్ఆర్ నూతన పింఛను కానుకలను ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అందజేశారు. అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైసిపి మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, సర్పంచ్ కంబపు రామిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధనుంజయరావు, పంచాయతీ రాజ్ ఎఇ కూర్మనాథం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు, విద్యుత్‌శాఖ ఎఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలాకి : పింఛను పంపిణీ చేస్తున్న రమణమ్మ

కొత్తూరు : మండలంలోని గురండి పంచాయతీలో కొత్తగా 12 పింఛన్లు మంజూరయ్యాయి. దాశరథిపురానికి మూడు, గురండికి మూడు, కాశీపురానికి ఆరు మంజూరయ్యాయి. వీటిని లబ్ధిదారులకు సర్పంచ్ బోర సింహాద్రినాయుడు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రాజారావు, కన్వీనర్లు రాఘవ, సునీత, వాసుదేవరావు పాల్గొన్నారు.

వికలాంగులు మనలో ఒకరే..

ప్రజాశక్తి- నందిగాం

వికలాంగులు మనలో ఒక్కరేనని, వారిని తోటి వారిగా గుర్తించి సహాయ, సహకారాలు అందించాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. బుధవారం అంధుల దినోత్సవం సందర్భంగా ఎంఇఒ కార్యాలయంలో ఐఇడి టీచర్ పి.రాణి ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి అంధ విద్యార్థులకు వినికిడి యంత్రాలు, బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుభద్రాపురం సర్పంచ్ సోమేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: లూయి బ్రెయిలీ అంధులకు ఆరాధ్యదైవమని ఎంఇఒ పి.వి.రామరాజు అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రెయిలీ లిపి ద్వారా విద్యను అభ్యసించిన పలువురు అంధులు ప్రస్తుతం విద్యతో పాటు కొన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఐఇఆర్‌టి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ బోయిన శ్రీధర్ పాల్గొని బ్రెయిలీపై వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఐఇడి ఉపాధ్యాయులు సీమల ఢిల్లీరావును అభినందించారు. కార్యక్రమంలో జి.వి.లక్ష్మి, ఐశ్వర్య, స్వప్న, రాజేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పొందూరు : మాట్లాడుతున్న ఎంఇఒ రామరాజు

'సజ్జల'ను కలిసిన వెంకట సత్యనారాయణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

సజ్జలతో కూన

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని గ్రామ వార్డు సచివాలయ సంఘం ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ అమరావతిలో ఆయన కార్యాలయంలో బుధవారం కలిశారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగుల ప్రధాన సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు గ్రేడ్-4 ఉద్యోగులకు పరిపాలనా అధికారాలు పూర్తిగా ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై సజ్జల స్పందించి త్వరలోనే బదిలీలు చేపడతామని కూన తెలిపారు. కార్యక్రమంలో 384/2022 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర సహాధ్యక్షులు వరప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మహాలక్ష్మి, ఇందురుమల్లి మణి, రాష్ట్ర కోశాధికారి శిష్టు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు మధులత, అయ్యప్ప పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో చలో ఢిల్లీ

ప్రజాశక్తి- నరసన్నపేట

శిష్టకరణాలను ఒబిసిలో చేర్చాలని కోరుతూ ఫిబ్రవరిలో చలో ఢిల్లీ నిర్వహించనున్నట్లు శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలిమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం నరసన్నపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిష్టకరణాలను ఒబిసిలో చేర్చేలా కేంద్రానికి సిఫార్సు చేయాలని కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసి కోరినట్లు చెప్పారు. సిఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎంపీ జివిఎల్ నరసింహారావును కోరామని, సంబంధితశాఖ కేంద్ర మంత్రిని ఢిల్లీలో కలుద్దామని భరోసా ఇచ్చారని అన్నారు. ఆసక్తిగల వారు తనతో ఢిల్లీ వచ్చేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, నాయకులు సదాశివుని ప్రభాకరరావు, డివి రఘు, బి.రాంమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి అప్పలరాజు

ఈ-కలెక్షన్‌తో రైతు ఉత్పత్తుల సేకరణ

మంత్రి అప్పలరాజు

పలాస : రైతులు పండించిన ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన సరసమైన ధరకు కొనుగోలు చేసి, వాటిని ఆర్‌బికెల ద్వారా కొనుగోలుదారులకు విక్రయించే సంస్థను ఏర్పాటు చేశామని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఆ సంస్థ నిర్మాణానికి పిఎసిఎస్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పలాసలోని మంత్రి కార్యాలయం వద్ద పిఎసిఎస్ ఆధ్వర్యంలో రూ.13.50 లక్షలు చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తర్లాకోట పంచాయతీ సిరిపురం గ్రామంలో గిరిజన యువత, గిరిజనేతర సభ్యులతో కూడిన 10 మంది బోర్డు సభ్యులతో ఈ సంస్థను నిర్మించినట్లు తెలిపారు. వందలాది రైతు కుటుంబాలకు లబ్ది చేకూరేలా చేయడంతోపాటు రైతులకు ఆర్థిక స్వావలంబన చేకూర్చేలా ఈ-కలెక్షన్ సెంటర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. మహదేవ్ హార్టికల్చర్ ఫార్మర్ ప్రొడ్యూస్ కంపెనీ నిర్మాణం చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకట్రావు(చిట్టి), వైస్ ఎంపిపి దాలమ్మ, సవర లక్ష్మణరావు, మోహన్‌రావు, సోమేష్ రమేష్, దానయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వాణిజ్య పంటలతో అధిక దిగుబడులు

సంతబొమ్మాళి: వాణిజ్య పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకతి వ్యవసాయం ఆర్‌టిఒ హేమసుందర్ అన్నారు. బుధవారం కాపు గోదయ్యవలసలో ఫీల్డ్ విజిట్ చేశారు. ముఖ్యంగా రబీ డ్రై సోయింగ్, పలు పంటల విధానం, పిఎండిఎస్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు 365 రోజులు పలు పంటలు, అంతర పంటలు వేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని అన్నారు. గేదెలు గౌరీ చెరుకు పొలంలో 200 లీటర్ల జీవామృతం తయారు చేశారు. కార్యక్రమంలో కె.ఉష, వి.రోజా, తంగి వేణమ్మ, పొంక శివ, సూర్యనారాయణ, వేదవతి పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకారం అవసరం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజరు పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బందితో సచివాలయ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకుందామని, అందకు సహకరించాలని కోరారు. అనంతరం రెడ్డిక వీధిలో ఉన్న మంచినీటి బావిని, డ్రైనేజీలను పరిశీలించి, మంచినీటి బావిని క్లోరినేషన్ చేసి, బావి చుట్టూ ఉన్న మురికినీరు, డ్రేనేజీలకు దారి చూపించి శుభ్రం చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనపాన బాలకృష్ణ, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని పురుషోత్తపురం జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల ప్రగతిని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు, అర్బన్ హౌసింగ్ అధికారి సిహెచ్ మల్లేశ్వరరావు పరిశీలించి, పలు సూచనలు చేశారు. బుధవారం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడి, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కాలనీలో అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని తెలిపారు. హౌసింగ్ బిల్లుపై ఎటువంటి అపోహలు వద్దు అని, చెల్లింపులు జరుగుతాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9న బడ్జెట్ సమావేశం

లావేరు : మండల పరిసత్ సమావేశ మందిరంలో ఈ నెల 9న ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

'యువశక్తి' పోస్టర్ ఆవిష్కరణ

కోటబొమ్మాళి: ఈ నెల 12వ తేదీన రణస్థలంలో నిర్వహించే యువశక్తి పోస్టర్‌ను జనసేన టెక్కలి నియోజకవర్గ నాయకులు పల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యాన నాయకులు విద్యార్థులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనసేన యువశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం, వలసలు పోవాలంటే ఈ కార్యక్రమం విజయవంతం చేసి జనసేనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తెలగవలస ప్రసాద్, చందు, జనార్ధన్, పవన్, శ్రీను, రాజేష్, మండల నాయకుడు ధన్‌రాజ్, ప్రసాద్, గణేష్, సాయి, నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాపాకలో ఆధార్ కేంద్రం ప్రారంభం

పొందూరు: మండలంలోని రాపాక సచివాలయం-1లో బుధవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా చేపట్టనున్న ఆధార్‌లో మార్పులతో, చేర్పులతో పాటు కొత్త కార్డులు మంజూరు వంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి శాంతిస్వరూప్, విఆర్‌ఒ బల రాం, డిజిటల్ అసిస్టెంట్ మహాలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ పుష్పలత, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

సోంపేట: మండలంలోని మా కన్నపురం పాఠశాలలో విద్యార్థులకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజు ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నిరుపేద విద్యార్థులకు సైతం సాంకేతిక, కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛను లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి నిమ్మన దాసు, జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగారావు, బుద్దాన శ్రీకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టెంకూరులో పారిశుధ్య పనులు

సంతబొమ్మాళి: మేఘవరం పంచాయతీ టెంకూరు గ్రామంలో సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సూరాడ రాజారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాకేష్ వర్మ, పరపటి రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- రణస్థలం

నియోజకవర్గంలోని మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హామీనిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని జీరుపాలెం, కొవ్వాడ, ఎన్.జి.ఆర్.పురం, దోనిపేట, అల్లివలస, కొత్తముక్కాం, కొమరవానిపేట, బడివానిపేట (జాలరకొయ్యాం), డి.మత్స్యలేశ్యం, బుడగట్లపాలెం పంచాయతీల మత్స్యకారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ముఖ్య సమస్యలను ఒక్కొక్కరినీ అడిగి తెలుసుకున్నారు. కొవ్వాడ విద్యుత్ సమస్యలు, మత్స్యకార గ్రామాల్లో విద్యుత్ సదుపాయాల కల్పన, డ్వాక్రా మహిళా రుణాలు, గృహ నిర్మాణ బిల్లులు, విశ్రాంతి భవనాలు, గ్రామ కంఠం, రహదారులు, కాలువలు, జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్ మాట్లాడి త్వరితగతిన మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మైలపల్లి కామరాజు, మూగి శ్రీరాములు, అంబటి రాంబాబు, చీకటి యర్రయ్య, మైలపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

దుస్తులను పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీధర్

దుస్తుల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : ధనుర్మాసం మేలుకొలుపులు బృందానికి వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ నూతన దుస్తులను పంపిణీ చేశారు. నగరంలోని కొన్నావీధి భీమేశ్వర భజన బృందం వారిచే 24 వసంతాల ధనుర్మాస మేలుకొలుపుల పండగల్లో భాగంగా బుధవారం గోవిందనగర్ కాలనీకి వెళ్లి దుస్తులను అందజేశారు. మేలుకొలుపులు బృందం సభ్యులకు ఎప్పుడైనా మెడికవర్ ఆస్పత్రి తరుపున తరపున అన్ని ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో 19వ డివిజన్ నాయకులు బిర్లంగి రామమోహనరావు, బొమ్మన విజయకుమార్, డోల తవిటినాయుడు, పొడిని నారాయణరావు, జవ్వాది రామకృష్ణ, శాసనపురి త్రినాథరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న రాజ్యలక్ష్మి

మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పాటు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ఇచ్ఛాపురం: మహిళా సంఘాల అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి తోడ్పాటు అందిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో 23వ వార్డుకు చెందిన జ్యోతి సంఘం, 20వ వార్డుకు చెందిన శ్రీ వినాయక, నవ జ్యోతి, 23వ వార్డుకు చెందిన మధుర మీనాక్షి, లక్ష్మి గణపతి సంఘాలు, 7వ వార్డు నుంచి నరసింహ సంఘం సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ ఆసరా, సున్నావడ్డీ, రుణమాఫీ, వైఎస్ఆర్ చేయూత వంటి పథకాల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు రుణాలు అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలని, రుణాలు తిరిగి చెల్లించేటప్పుడు క్రమం తప్పకుండా చెల్లిస్తే సంఘాలతో ఎటువంటి సమస్యలు ఉండవని సూచించారు. ఎవరైనా అర్హత కలిగివుండి, లబ్ధిపొందని వారి సమస్యను తమ దృష్టికి తేవాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిఒలు బాలరాజు, సంతోష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధి నిధులతో జిల్లాలోని 11 ఆలయాల అభివృద్ధికి చేసేందుకు దేవాదాయశాఖ కమిషనర్ అనుమతులు మంజూరు చేశారని విశాఖపట్నం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ కార్యనిర్వాహక ఇంజినీరు సిహెచ్.వెంకటరమణ తెలిపారు. శ్రీకాకుళం మండలం శ్యాంపాలెం, ఎచ్చెర్ల మండలం డి.మత్యలేశం గ్రామాల్లోని పురాతన ఆలయాలను బుధవారం సందర్శించారు. ఆయనతో పాటు జిల్లా దేవాదాయశాఖ అధికారి ప్రసాదరావు, సహాయక ఇంజినీరు చందన, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఉన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి హెచ్‌ఎం వై.అరుణశ్రీ, పి.సుధారాణి, ఎన్.తారకేశ్వరరావు పూలమాలేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే బాలికా విద్యను అందించేందుకు, మహిళా జనోద్ధరణకు చేసిన కృషి నేటితరం మహిళా ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మాట్లాడుతూ ప్రభుత్వం బాలికా విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మహిళా ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టాలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో కెజిబివి ఇన్‌ఛార్జి స్పెషల్ ఆఫీసర్ కె.భారతి, యుటిఎఫ్ మందస శాఖ అధ్యక్ష, కార్యదర్శి పి.కొండలరావు, కె.మాధవరావు, నాయకులు జయరాం, దాసరి ఈశ్వరరావు, అపోటా నాయకులు అరుణ్‌కుమార్, భాగ్యలక్ష్మి, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెచ్‌ఎం అరుణశ్రీ

సభలపై ఆంక్షలు తగవు

ప్రజాశక్తి- టెక్కలి

సభలు, సమావేశాలు, ప్రచారాలు, రోడ్ షోలపై ఆంక్షలు తగవని టిడిపి, కాంగ్రెస్, జనసేన, సిపిఐ నాయకులు ముక్తకంఠంతో నినదించారు. బుధవారం వేర్వేరుగా వారంతా ప్రకటనలు విడుదల చేశారు. పాదయాత్ర ద్వారానే జగన్ అధికారంలోకి వచ్చారని, అటువంటి ర్యాలీలు, సభలు, పాదయాత్రలపై ఆంక్షలు పెట్టడం అంటే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు. ప్రజలతో మాట్లాడే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఎక్కడో ఒక చోట చిన్నపాటి స్వల్ప తప్పిదం జరిగితే దాన్ని గోరంత.. కొండంతలు చేసి సమస్యను భూతద్దంలో చూపి చీకటి జిఒలు జారీ చేయడం తగదని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు బి.శేషగిరి, పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, ఎస్‌సి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు మట్ట పురుషోత్తం, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు రెయ్యి ప్రతీష్‌చంద్, జనసేన నాయకులు కణితి కిరణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేడాడ పరమేశ్వరరావు, సిపిఐ నాయకులు ఎ.షణ్ముఖరావు, ఎస్‌సిసెల్ నాయకుల కె.యాదవ్, యడ్ల గోపి, తదితరులు కోరారు.

నియామక పత్రం అందజేత

నందిగాం: మండలంలోని దిమిలాడ ఫీల్డ్ అసిస్టెంట్‌గా అట్టాడ వినోద్‌కుమార్‌ను నియమిస్తూ ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పంచాయతీలోని ఉపాధి కూలీలకు పని కల్పించడంతోపాటు పనికి తగ్గ కూలి అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హెచ్‌వి.రమణమూర్తి, ఎపిఒ ఎం.నాగరాజు, సర్పంచ్ హనుమంతురావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఇఎస్ఐ ఆస్పత్రి పనులు వేగవంతం

రణస్థలం: పైడిభీమవరం పరిధిలో పరిశ్రమల్లో 18,000 పైచిలుకు కార్మికులు పనిచేస్తున్నారని, వారి ఆరోగ్య అవసరాల మేరకు రూ.6 కోట్ల వ్యయంతో ఇఎస్ఐ ఆస్పత్రి మంజూరైందని, ఈ పనులు వేగవంతం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణానికి నిర్వహణ, పర్యవేక్షణ లోపం వల్ల ఇంతవరకు నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు. దూరం ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం కార్మికులు వెళ్లడం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

సేంద్రీయ వ్యవసాయం ముద్దు

బూర్జ: సేంద్రీయ పద్ధతుల ద్వారా మహిళలు కూరగాయాలు, రాగిజొన్న తదితర పంటలు పండించి ఆదర్శంగా నిలవాలని ఎఫ్‌టిఒ మణమ్మ అన్నారు. మండలంలోని పాలవలసలో సన్న, చిన్నకార మహిళా రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు గ్రూపులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. మహిళ రైతులు పంటలను సాగు చేసే విధంగా ప్రభుత్వాలు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జల్లు అప్పల స్వామినాయుడు, డిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాంనాయుడు, ఐకెపి ఎపిఎం బాబూరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మణమ్మ